క్లుప్తంగా

వైభవంగా రాజ్యలక్ష్మి అమ్మవారి ఊరేగింపు



పడమరఖండ్రికలో రాజ్యలక్ష్మి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామ దేవత శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర ఉత్సవాల నేపథ్యంలో బుధవారం అమ్మవారిని గద్దెదింపారు. అమ్మవారిని ఆలయ ఆసాదులు విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు



వీరలక్ష్మి

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేటకు చెందిన కంచర్ల వీరలక్ష్మి (53) ఈ నెల ఒకటి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు ద్రాక్షారామ ఎస్సై ఫోన్ నంబర్ 94409 04850, 63040 57988, 80962 66759 నంబర్లకు సమాచారం ఇవ్వవలసిందిగా ఎస్సై కోరారు.

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా



సీహెచ్ శ్రీనివాసరావు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 6న నిర్వహించాల్సి ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్లలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈ నెల 13కు వాయిదా పడినట్లు ద్రాక్షారామ పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ఈ మార్పును గమనించాల్సిందిగా ఆయన సూచించారు.

ఇంటి నంబర్ ప్లేట్లకు డబ్బులు వసూలు చేయడం సరికాదు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో అమరిక పేరుతో డబ్బులు వసూలు చేయడం సరికాదని పడమర ఖండ్రిక మాజీ గ్రామ సర్పంచ్ వంగా శ్రీనివాస్ అన్నారు. పడమర ఖండ్రిక గ్రామంలో ప్రైవేటు ఏజెన్సీ నిర్వాహకులు ఇంటింటికీ నంబర్ ప్లేట్ అమర్చి రూ.50 వసూలు చేయడాన్ని బుధవారం ఆయన తప్పుబట్టారు. నంబర్ ప్లేట్లు అమర్చడమనేది ప్రభుత్వ కార్యక్రమమా ? కాదా ? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కొన్నేళ్ల క్రితం ఇలాంటి ప్రక్రియ ద్వారా నివాసితుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారన్నారు. దానిపై అప్పట్లో ఆందోళన చేయడం ద్వారా నంబర్ ప్లేట్లు వేయడమనే నిర్ణయాన్ని అప్పటి ప్రభుత్వం మానుకుందని గుర్తు చేశారు. పంచాయతీ ఉన్నతాధికారులు స్పందించి ఇంటి నంబరు ప్లేట్లు అమర్చడంపై స్పష్టత ఇవ్వాలని శ్రీనివాస్ కోరారు.

ఆటిజంపై అవగాహన



సోమేశ్వరం భవిత కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయవరం: మండలంలోని సోమేశ్వరం భవిత కేంద్రంలో బుధవారం ఆటిజంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రపంచ ఆటిజం డేను పురస్కరించుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ మెయిన్ స్కూల్ హెచ్ఎం ఎం.లక్ష్మీకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవిత కేంద్రం ఐఈఆర్టీలు తిరగట్టి వీరవేణి, పోదూరి ఆదర్శ్ ఆటిజంపై అవగాహన కల్పించారు. ఆటిజం సమస్య నుంచి పిల్లలను బయటకు తీసుకురావడానికి అవసరమైన విధానాలను వివరించారు. భవిత కేంద్రాల్లో ఆటిజం సమస్యకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

డైనింగ్ హాల్ ప్రారంభం

అయినవిల్లి: విలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి కొప్పిశెట్టి రామకృష్ణ నిర్మించిన డైనింగ్‌హాల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా బుధవారం ప్రారంభించారు. అలాగే ఎన్ఎంఎస్ స్కాలర్‌షిప్ తీసుకున్న ఏడుగురు విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు పీవీ రవిప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ అమలకట్ల చక్రవర్తి తదితరులు ఉన్నారు.

20 లీటర్ల సారాతో మహిళ అరెస్ట్

కొత్తపేట: ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన కోట సత్తెమ్మ అనే మహిళను 20 లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకుకూరలతో ఆరోగ్యం

- సాగులో మెళకువలు అవసరం
- ఆరోగ్యానికి ఎంతో మేలు

కె.గంగవరం: విటమిన్లు, లవణాలు, మాంసకృత్తులు, పీచు పదార్థాలు మెండుగా ఉండే ఆకుకూరలకు ఈ మధ్య డిమాండ్ బాగా పెరిగింది. దీనికి తోడు స్వల్ప వ్యవధిలో పంట చేతికందుతుంది. ఆకుకూరలను తినడం ద్వారా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. దీంతో పాటు ఆకుకూరల సేద్యం ద్వారా ఆదాయం కూడా పెరుగుతుంది. ఆకుకూరల సాగు మెళకువలపై కె.గంగవరం ఏఓ ఎస్.బలుసు రవి అందిస్తున్న సూచనలు.

నేల తయారీ.. ఎరువులు

ముఖ్యంగా ఆకుకూరల సాగుకు నేల తయారీ చాలా ముఖ్యం. మెత్తడి దుక్కు వచ్చే వరకు లోతు దుక్కితో పాటు 3, 4 సార్లు సాధారణ దుక్కి చేయాలి. దుక్కిన తరువాత నేలలో మట్టి పెళ్లలు లేకుండా చదును చేసుకోవాలి. నేలను సమాంతరంగా సిద్ధం చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల పేడ, 300 కిలోల వేపపిండి, 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 10 కిలోల జింకు సల్ఫేట్, రెండు కిలోల గ్రాన్యుబోర్, 100 కిలోల శుద్ధిచేసిన ట్రికోటెర్మా, 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకుని ఆకుకూరలను విత్తుకోవాలి.

తోట కూర

ఈ విత్తనాల చాలా చిన్నవిగా ఉంటాయి. వీటిని ఇసుకతో కలిపి తయారు చేసుకున్న నేలలో విత్తుకోవాలి. ఎకరానికి 800 గ్రాములు సరిపోతాయి. 10 కిలోల ఇసుకను కలిపి మడులపై పలచగా చల్లుకొని పలుచని పారలా మెత్తటి మట్టి లేదా ఇసుకతో కప్పాలి.



తోటకూర

కొత్తిమీర

కొత్తిమీర విత్తుకునేటప్పుడు విత్తనాన్ని రెండు బద్దలుగా చేయాలి. లేకపోతే గింజ ఆలస్యంగా మొలకెత్తి మొలకశాతం దెబ్బతింటుంది. దీనికి కోసం గింజలను నేలపై పోసి సున్నితంగా నేలకేసి రుద్దాలి.

మెంతికూర

ఇది పప్పు జాతి పంట. మొదటిసారి పొలంలో విత్తే ముందు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టిస్తే వాతావరణంలోని నత్రజనిని గ్రహించడానికి తోడ్పడుతుంది. దీని ద్వారా మెంతికూర మొక్కల పెరుగుదల బాగుంటుంది.



పాల కూర

పాలకూర

విత్తనాలను 3.4 సెం.మీ లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువ అయితే మొలక సారిగా రాదు. ఎకరానికి నాలుగు లేదా ఐదు కిలోల విత్తనాలు సరిపోతాయి. పాల కూర కూడా పంట త్వరగా చేతికందుతుంది.

కరివేపాకు

విత్తనాలను పండు నుంచి వేరు చేసిన వెంటనే నేలలో విత్తుకోవాలి. ఆరిన తరువాత విత్తితే మొలక శాతం బాగా తగ్గిపోతుంది. విత్తని 48 గంటలలోపు నేలలో పదును చూసుకుని లీటరు నీటికి నాలుగు లీటర్ల పిండి మిథాలిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట తొలి దశలో కలుపును నివారించుకోవచ్చు. ఇలాంటి సస్యరక్షణ చర్యలు చేపడితే ఆకుకూరల్లో చీడపీడలు నివారించుకుని మంచి దిగుబడులు సాధించుకోవచ్చు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: గ్రామ, వార్డు సచివాలయాల్లో గురువారం నుంచి ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 3 నుంచి 5 వరకూ మొదటి విడతగానూ, 8 నుంచి 11 వరకూ రెండో విడతగానూ గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. గురువారం పడమర ఖండ్రిక, అంగర 1, వడ్లమూరు సచివాలయాల్లో శిబిరాలను నిర్వహించనున్నారు. 4న పడమర ఖండ్రిక, కోరుమిల్లి, వడ్లమూరు, 5న అంగర 2, కోరుమిల్లి, కాలేరు, 8న అద్దంకివారిలంక, మాచర, నల్లూరు, 9న కేదారిలంక, మాచర, నల్లూరు, 10న తాతపూడి, టేకి 2, వెదురుమూడి, 11న కపిలేశ్వరపురం 2, టేకి 2, వెదురుమూడి సచివాలయాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి వివరించారు.

రుణ దరఖాస్తుదారులకు నేడు ఇంటర్వ్యూలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని 25 పంచాయతీల పరిధిలో బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి నేడు రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా బ్యాంకుల ప్రతినిధులతో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి బుధవారం విలేకరులకు తెలిపారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, రైస్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రాల మూడు సెట్ల జెరాక్స్ కాపీలు తీసుకుని హాజరు కావాలని సూచించారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



ఏరియా ఆసుపత్రిలో టీబీ పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామచంద్రపురం: క్షయ వ్యాధి నియంత్రణ, నిరోధక చర్యల్లో భాగంగా పీపీ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో క్షయ నిర్ధారణ పరీక్షలను ఆర్ఎంఓ డాక్టర్ కె.చక్రధర్ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబీకులకు టీబీ స్కాన్ పరీక్షలను 10 మందికి చేశామని పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.గోపీకృష్ణ వెల్లడించారు. టీబీ యూనిట్ ఎస్‌టీఎస్ లీలా, ఎల్‌టీ శ్రీనివాస్, పీపీ యూనిట్ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అప్రోచ్ నిర్మించాలి



దంగేరు–శివల రహదారిలో అప్రోచ్ లేక ప్రమాదకరంగా వంతెన

కె.గంగవరం: మండలంలోని దంగేరు నుంచి శివల వెళ్లే రహదారిలో వంతెన వద్ద అప్రోచ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు అంటున్నారు. కనీసం ఇక్కడ గ్రావెల్ అయినా వేసి తాత్కాలిక ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే అక్కడ అప్రోచ్ నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

కాజులూరు: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం నేత, గొల్లపాలెం ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. బుధవారం గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైఎస్ జగనన్న తన పాలనలో సంక్షేమ పథకాలతో పాటు ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సు సేవలు, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వాటితో పాటు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 10,032 విలేజ్ హెల్త్ సెంటర్లు, 17 మెడికల్ కళాశాలలు నిర్మించి ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో 53,800 స్పెషలిస్టు డాక్టర్లను, నర్సులను నియమించారన్నారు. ప్రజారోగ్యం కోసం అంత పెద్దెత్తున పథకాలు రూపొందించినప్పటికీ ఇంకా గ్రామాల్లో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారనే భావనతో 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం' రూపొందించి గ్రామాల్లో నిపుణులైన వైద్యులతో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స అందించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా జగనన్న పథకాలను పక్కన పెట్టడమే కాకుండా ప్రజారోగ్యాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. పాలకులు గత పథకాలను పునరుద్ధరించడమే కాకుండా ప్రజారోగ్యానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మండల పార్టీ యువజన విభాగ కార్యదర్శి నిమ్మితి విజయ్, దంగేటి వెంకన్న, చింతా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

రామచంద్రపురం రూరల్: గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా ఏర్పడిన గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలందరికీ ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌర సేవలను అర్హులందరికీ పారదర్శకంగా అందించాలని ఆర్డీవో దేవరకొండ అఖిల గ్రామ సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని ద్రాక్షారామ టు సచివాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రికార్డుల నిర్వహణ రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. పౌరులకు అందిస్తున్న పౌరసేవలు పూర్తి స్థాయిలో అందు తున్నది లేనిది అనే విషయాలను లబ్ధిదారుల ద్వారా ఆరా తీశారు. సచివాలయానికి వివిధ సేవల నిమిత్తం వచ్చే ప్రజానీకంతో స్నేహభావంతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సచివాలయ వ్యవస్థ పనితీరుపై విశ్వసనీయతను పెంపొందించాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి, పౌరులకు అవసరమైన సేవలను సకాలంలో అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. పారదర్శకంగా అందించి జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. అనంతరం మండలంలోని వెల్ల పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ముందుగా హాజరు పట్టిని పరిశీలించి వైద్యులు సిబ్బంది సక్రమంగా విధులకు హాజరవుతున్నది లేనిది పరిశీలించారు. సమయ పాలనతో రోగులకు సేవలు అందిస్తున్నది లేనిది రోగుల ద్వారా ఆరాతీశారు. అనారోగ్యంతో వచ్చే రోగులకు సంతృప్తి కొలమానంగా వైద్య సేవలు నిర్వహణ తీరు ఉండాలని ప్రభుత్వం పదేపదే చెబుతుందని ఆ దిశగా వైద్యులు రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో పద్మావతి, ఈవోపీఆర్డీ సెల్టన్ రాజు, సర్పంచ్ అరుణ, వైద్యులు ప్రసన్న, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు



ద్రాక్షారామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆర్డీవో అఖిల

టిడ్కో గృహాలను వెంటనే స్వాధీనం చేసుకోవాలి

మండపేట: గొల్లపుంత రోడ్డులో ఫేజ్ 1లో నిర్మించి ఇచ్చిన టిడ్కో గృహాలను లబ్ధిదారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో ప్లాట్లను రద్దు చేస్తామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుని ప్లాట్లలోకి నివాసానికి రాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 7వ తేదీ లోపు లబ్ధిదారులు ప్లాట్లలోకి రావాలన్నారు. ఇందుకోసం కాలనీలో ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేశామని, లబ్ధిదారులు అక్కడికి వచ్చి తాళాలు తీసుకుని గృహ ప్రవేశాలు చేయాలని సూచించారు. గడువులోగా స్పందించని లబ్ధిదారుల ప్లాట్లు వెనక్కి తీసుకుని నూతన అర్హులకు అందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు కాలనీలో సమావేశం నిర్వహించి గృహ ప్రవేశాలు చేయని లబ్ధిదారుల వివరాలు నమోదు చేశారు. నిర్లక్ష్యం చేస్తే ప్లాట్లను కోల్పోవాల్సి వస్తుందని కమిషనర్ రంగారావు హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ కె.శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, బి.ఆంజనేయులు, టిడ్కో సీఎల్‌టీసీ జె.బిందు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ప్లానింగ్, వెల్ఫేర్ కార్యదర్శులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్లాట్ల అప్పగింత కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో అధికారులు

సీహెచ్‌సీలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

మండపేట: స్థానిక గమ్మిలేరు రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో బుధవారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రాధాకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది పలువురికి సీవైటీబీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఆసుపత్రిలో ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగి ఇంట్లో కుటుంబ సభ్యులు ముందు జాగ్రత్తగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ అంటు వ్యాధితో సమానమని, బాధితులు రోగం నయం అయ్యేంత వరకూ డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలన్నారు. రోగి కోలుకునేంత వరకూ ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్లు కేఎస్‌వీ రమణ, భాను బేగం, పావని, అన్నపూర్ణ, డాక్టర్లు కె.సతీష్, లావణ్య, హెడ్‌నర్స్ మాధురి, ల్యాబ్ అసిస్టెంట్లు సంపత్‌రెడ్డి, నరసింహ, ప్రిసిల్లా, ఐసీటీసీ కౌన్సిలర్ నాగలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మండపేటలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

భూసారానికి అనుగుణంగానే ఎరువుల వినియోగం

కాజులూరు: భూసారానికి అనుగుణంగా పంటపొలాల్లో ఎరువులు వినియోగించడం ద్వారా ఖర్చులు తగ్గి రైతులకు నికర ఆదాయం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి వి.ఆశోక్ అన్నారు. బుధవారం గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ దాళ్వా మాసూళ్లు పూర్తయిన అనంతరం వేసవిలో ప్రతి రైతు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షల ఆధారంగా భూమిలో సహజ సిద్ధంగా ఏర్పడే నత్రజని, పాస్ఫరస్ వంటి ఎరువుల లభ్యతను గుర్తించి అవసరాన్ని బట్టి పైపాటుగా ఎరువులు వినియోగించవచ్చన్నారు. గ్రామాల్లో ప్రతి రైతుకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించుకునేలా వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. వీఏఏలు రమ్య, శిరీషా, అనూష తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వ సభ్య సమావేశం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన రేపు 4న మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

పందుల స్వైరవిహారాన్ని అరికట్టాలి

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో పందుల స్వైరవిహారాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. పందుల పెంపకం ద్వారా ప్రమాదకరమైన అంటు వ్యాధులు సోకుతాయని వైద్యులు సూచిస్తున్నప్పటికీ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పెంపకదారులు విచక్షణరహితంగా వాటి సంఖ్యను పెంచుతూ గ్రామంలోకి వదులుతున్నారు. అవి గ్రామంలోని డ్రైనేజీల్లో పొర్లుతూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. దీంతో భరించలేని దుర్వాసన వస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, పీహెచ్‌సీ ఆవరణం పందులకు ఆవాస కేంద్రాలుగా మారాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పందుల పెంపకాన్ని నిరోధించాలని గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేస్తున్నారు.



గొల్లపాలెం రోడ్డుపై సంచరిస్తున్న పందులు

కొనసాగుతున్న రిలే దీక్షలు

మండపేట: మద్యం షాపును ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్ల మధ్యకు రానివ్వమని మహిళలు స్పష్టం చేశారు. స్థానిక సత్యశ్రీ రోడ్డులో మద్యం షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా 28, 29, 30 వార్డుల ప్రజలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 13వ రోజు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికుల అంగీకారం లేకుండా ఇళ్ల మధ్య వైన్ షాపు ఏవిధంగా పెడతారని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కాగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దీనిపై స్పందించి మహిళలకు మద్దతు పలికారు. తాను అన్నివిధాలా అండగా ఉంటానని, జనావాసాల మధ్య వైన్ షాపు ఎలా నెలకొల్పుతారో చూస్తానని హెచ్చరించారు. అదేకనుక జరిగితే తానే స్వయంగా టెంట్ వేసి వైన్ షాపు ఎదురుగా కూర్చుంటానని హెచ్చరించిన నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు స్పందించి సంఘటన స్థలాన్ని సందర్శించారు. మహిళలు వారిని ప్రశ్నించగా ఇక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. రిలే దీక్షల్లో మూడు వార్డుల మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 14 రోజుల జైలు

మండపేట: డ్రంక్ డ్రైవ్ కేసులో నిందితులకు కోర్టు 14 రోజుల జైలు శిక్షతో పాటు రూ.10500 జరిమానా విధించినట్టు టౌన్ సీఐ దారం సురేష్ బుధవారం తెలిపారు. పట్టణంలో నిర్వహించిన డ్రంక్ డ్రైవ్ తనిఖీల్లో వడ్లమూరుకు చెందిన ఇల్లూరి రాజబాబు, పట్టణానికి చెందిన సందాల సాయికుమార్ పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి ఆలమూరు కోర్టులో హాజరపరచగా న్యాయమూర్తి పైవిధంగా శిక్ష వేశారని ఆయన తెలిపారు.

'చింతం' సేవలు చిరస్మరణీయం



వెంకటేశ్వరరావుకు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: సీనియర్ జర్నలిస్ట్ చింతం వెంకటేశ్వరరావు సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. చింతం వెంకటేశ్వరరావు దశదిన కర్మ కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామం మండలంలోని మందపల్లిలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, డీఎస్పీ సుంకర మురళీమోహన్, ప్రముఖ వైద్యుడు మెంటే ఉదయభాస్కరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు స్వాతిప్రసాద్ తదితర రంగాల ప్రముఖులు పాల్గొని వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారు మాట్లాడుతూ జర్నలిజంలో వెంకటేశ్వరరావు అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, రాష్ట్ర టీడీపీ నాయకుడు ఆకుల రామకృష్ణ, డాక్టర్ ఎం.శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘ నూతన కార్యవర్గం ఏర్పాటు

మండపేట: పట్టణ శెట్టిబలిజ సంఘ నూతన కార్యవర్గం కొలువుదీరింది. ఆలమూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న శెట్టి బలిజ కల్యాణ మండపంలో బుధవారం సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ బండి గోవిందు, ఉపాధ్యక్షుడిగా పెంకే వెంకట్రావు, కార్యదర్శిగా మర్కిల శ్రీనివాస్, కోశాధికారి కుక్కల శ్రీనివాస్ ఎన్నుకున్నారు. కడలి నాగదుర్గారావును సహాయ కార్యదర్శిగా, సంఘ మాజీ ప్రెసిడెంట్ పంపన శ్రీనివాస్‌ను గౌరవ అధ్యక్షుడిగా, కార్యవర్గ సభ్యులుగా కుక్కల రామారావు, పెంకే గంగాధర్, నామాల చంద్రరావు, గుత్తుల గోవిందు, చొల్లంగి గోవిందు, పిల్లి శ్రీనివాస్, మట్టపర్తి గోవిందరాజు, చింతలపల్లి రామకృష్ణ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.



శెట్టి బలిజ సంఘ నూతన కార్యవర్గం

పండితుడికి ప్రశంసా పత్రం అందజేత

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన అతి ప్రాచీన విక్రమ భట్లేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు, శైవాగమ వేద పండితుడు కాళ్లకూరి సూరిపండుకు తిరుపతిలోని వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ ప్రశంసాపత్రాన్ని అందజేసింది. తిరుపతిలోని వేదిక్ యూనివర్శిటీ ద్వారా గత 21 రోజులుగా ఆన్‌లైన్ విధానంలో శైవాగమ, వైఖానస, పాంచరాత్ర ఆగమశాస్త్ర విభాగాల్లో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించారు. ఈ క్లాసుల్లో పాల్గొన్న వారికి ఇటీవల వార్షిక పరీక్షలు నిర్వహించగా అందులో కాళ్లకూరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. దీంతో తిరుపతిలోని వేదిక్ యూనివర్సిటీ ఆవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 'ఇంటర్నేషనల్ ప్రశంసాపత్రం'తో పాటు వేద పండిత గుర్తింపు పత్రాన్ని కూడా ఆయన స్వీకరించారు. కాళ్ళకూరి సూరిపండుని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు, మహిళా భజన మండలి సభ్యులు అభినందించారు.



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న వేద పండితుడు కాళ్లకూరి